యూనిట్ IV

# 12. సమ సమాజం

– తుమ్మల సీతారామమూర్తి చౌదరి

## చదవండి–ఆలోచించండి–మాట్లాడండి

ధర్మయ్య సత్యం, న్యాయం తప్పని కష్టజీవి. కూలిపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ధర్మయ్య తండ్రికి జబ్బు చేయగా దగ్గరలోఉన్న ఇందూరు ఆసుపత్రికి తీసుకు వెళ్ళాడు. "వ్యాధి చాలాముదిరింది. వెంటనే ఆపరేషన్ చేయాలి. లేకుంటే ప్రాణానికే ప్రమాదం" అన్నాడు వైద్యుడు. ధర్మయ్య భార్యసొమ్ములు అమ్మి డబ్బు తెచ్చినా, మరో ఐదువేలు కావాలన్నాడు. డాక్టరు ధర్మయ్య వాళ్ళ వీథిలో శ్రీమంతుడైన లక్ష్మీపతి దగ్గరకు వెళ్ళి "లక్ష్మీపతిగారూ! అయిదు వేలు అప్పివ్వండి. త్వరలోనే వడ్డీతోసహా తీరుస్తాను" అని ప్రాధేయపడ్డాడు. "తినడానికి తిండిలేనివాడివి అప్పెలా తీరుస్తావ్? అని కసిరి పంపించాడు లక్ష్మీపతి. ధర్మయ్య వారినీ వీరినీ అడిగి దిక్కుతోచక ఏడుస్తూ ఉంటే... వినయ్ అనే విద్యార్థిచూసి చలించిపోయాడు. ఆ విషయంవారి తండ్రికి చెప్పాడు. "పాపం! ధర్మయ్య చాలా మంచివాడు. సహాయం చేయండి నాన్నా" అన్నాడు. వినయ్ తండ్రి కూడా ధనవంతుడు, పేదలపట్ల ఆదరభావం కలవాడు. సహాయంచేశాడు. దాంతో ధర్మయ్య తండ్రికోలుకున్నాడు.

**ప్రశ్నలు:**

1. ధర్మయ్య ఎలాంటి వ్యక్తి?
2. లక్ష్మీపతి స్వభావం ఎటువంటిది?
3. ధర్మయ్యకు సహాయం చేసిందెవరు? అతనెలాంటివాడు?
4. వినయ్ స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?


**ఉద్దేశం:** ధనిక, పేద భావన లేని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని తెలియచెప్పడమే ఈ పాఠం ఉద్దేశం. ఈ పాఠం "యుగకవిత" లోనిది.

❇ గుర్తు గల పద్యాలు కంఠస్థం చేయండి.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.






ఒక యింట సిరులు మూల్గుట
యొక యింటన్ బ్రేవులఱచుచుండుట గల నే
లకు శాంతియుఁ, బాషాణము
నకు సంతానంబు నొక్కనాఁడే కలుగున్. 1

ఆఁకటికి మ్రగ్గి చలిదెబ్బ కలమటించి
మొండిరోగాల కవమానములకు లోఁగి
నాగరక లోకమున కొక్క నవ్వు విసిరి
పిలుచుచున్నాఁడు యమునహో! పేదవాడు. 2

ఎవని యెముక లీ మేడల కిటికలయ్యె
నెవని రక్తంబుచే గోడలిట్లు బిగిసె
నతనికా యిట్టి పరమహేయంపు బ్రదుకు
వానికా యిట్టి దుర్మరణానుభూతి. 3






ఈ పేదలు మనవేల్పులు
పాపము! వీ రెండి తడిసి పస్తుండి జగం
బాపోవ! గూడు పెట్టెద
రోపికలో వీరి కుద్ది యుండర యెవరున్. 4

పడగ విప్పి తోఁక పైనిల్చి ఫూత్కృతి
ధ్వనులు గ్రక్కు కోడె త్రాఁచు కాదు
కూడులేనివాని కుక్షిలో నెగసిన
చిచ్చు కడిఁది ముప్పు దెచ్చు మహికి. 5

❇పరులగోడు సుంత పట్టించుకొననిచో
శాంతి లేదు మనకు నింతయైన
వినుడు! తమ్ములార! విశ్వహితార్థులై
మనుఁడు మంచిబాటఁ గనుఁడు చనుఁడు. 6



❇సంపన్నులు తమ బంగరు
త గంపలకున్ దాము ధర్మకర్తల యని భా
వింపవలయుఁ బేదల సిరి
పెంపవలయుఁ, ద్రుంపవలయు బిసిడితనమ్మున్. 7

❇పసిడి మెండుకొన్న పాఁతఅలున్నను
బ్రేమలేనివాఁడు పేదవాఁడె
రువ్వకాదు గ్రుడ్డిగవ్వ లేకుండిన
నార్తుఁ జూచి కరఁగునతఁడు ధనియె. 8



**కవిపరిచయం:**



1. కవిపేరు : తుమ్మల సీతారామమూర్తి చౌదరి
2. జననం–మరణం : 1901–1990
3. జన్మస్థలం : గుంటూరు జిల్లా, రేపల్లె తాలుకా, కావూరు అనే గ్రామం.
4. రచనలు : మహాత్మకథ, ఆత్మార్పణము, రాష్ట్రగానము, ధర్మజ్యోతి, పఱిగపంట, ఉదయగానము, శబల, సర్వోదయగానము, తెనుగునీతి, నేను, పైరపంట మొదలయినవి.
5. బిరుదులు : 'అభినవ తిక్కన', 'తెనుగు లెంక'
6. శైలి : సులభంగా తెలిసేది, మృదుమధురంగా ఉంటుంది.

### పద్యభావములు

1. ఒక ఇల్లు సిరిసంపదలతో తులతూగుతూ ఉంటుంది. మరొక ఇంట్లో ఆకలికేకలు వినిపిస్తూంటాయి. ఇలాంటి చోట శాంతి వర్ధిల్లటం, రాళ్ళకి సంతానం కలగటం ఒకసారే జరుగుతాయి. రాళ్ళకు సంతానం కలగటం అసంభవయినట్లే అన్యాయం ఉన్నచోట శాంతిస్థాపన జరగడం కూడా అసంభవమే.
2. ఆకలికి మగ్గిపోయి, చలిదెబ్బకు విలవిలలాడిపోతున్నాడు పేదవాడు. అతన్ని మొండిరోగాలు పట్టివిడవటంలేదు. పైగా అడుగడుగునా అవమానాలే. ఇవన్నీ భరించలేక పేదవాడు ఏడవలేక నవ్వుతూ యముణ్ణి పిలుస్తున్నాడు.
3. పేదవాడు ఎముకలరిగేలా కష్టపడితేతప్ప ఒక భవననిర్మాణం జరగదు. పేదవాడి ఎముకలే భవంతులకు ఇటుకలయ్యాయి. అతడు రక్తం ధారపోస్తేనే గోడలు పటిష్టంగా ఉన్నాయి. అటువంటి పేదవాడు పరమ దయనీయంగా బతుకుతున్నాడు. దారిద్ర్యానికి తట్టుకోలేక దుర్మరణానికి పాల్పడుతున్నాడు.
4. ఈ పేదవాళ్ళు మనకు దేవతలతో సమానం. వీళ్ళు ఎండలో ఎండుతారు. వానలో తడుస్తారు. ఒకపూట తింటారు. మరోపూట పస్తుంటారు. కాని మిగిలిన ప్రజలు తృప్తిపడేలాగ వాళ్ళకు కూడు పెట్టేది వీళ్ళే. ఓపికలో వీళ్ళకు సాటివచ్చేవాళ్ళూ ఎవరూ లేరు.
5. పాము విషజంతువు. తాచుపాము మరీ ప్రమాదకరమైనది. అది పడగవిప్పి తోకమీద నిలబడి బుసలుకొడుతున్నప్పుడు దాన్ని సమీపించడం కన్నా ప్రమాదకరమైనది, కూటికి గతిలేనివాని కడుపుమంట.
6. ఇతరుల బాధలను కొంతవరకైనా పట్టించుకోవాలి. ఆ పని చేయకపోతే ప్రజలకు శాంతి ఉండదు. ప్రపంచం మేలు కోరేవారు మంచిమార్గాన్ని ఎంచుకొని దాన్నే అనుసరించాలి.
7. ధనవంతులు ఉదారంగా వ్యవహరించాలి. తమ సంపదకు తాము ధర్మకర్తలుగా ఉంటూ విరివిగా దానధర్మాలు చేయాలి. బీదవారి ఇంట్లో సిరులు కురిసేలా చూడాలి. పిసినారితనాన్ని వదిలిపెట్టాలి.
8. ఎంత బంగారమైనా కొనవచ్చు. ఎన్ని ధనరాశులైనా ఉండవచ్చు. కాని ప్రేమలేకపోతే ఆ వ్యక్తి పేదవాడికిందే లెక్క. తనదగ్గర ఒక్క పైసా లేకపోయినా పేదవాణ్ణి చూసి జాలిపడేవాడు ధనవంతుడే ఔతాడు. అంటే ఉన్నంతలో సాయం చేయాలి అని అర్థం.



©SCERT not to be republ

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలలో ఎవరికి సంబంధించిన విషయాలున్నాయో చెప్పండి.
2. పాఠం ఆధారంగా పేదవారి జీవన విధానం గూర్చి చెప్పండి.
3. పద్యాలు రాగంతో పాడండి. భావం చెప్పండి.
4. పాఠంలో మీకు నచ్చిన అంశమేదో చెప్పండి.
5. ఈ పాఠం ద్వారా కవి ఏం చెప్పదల్చుకొన్నాడు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. కింది భావానికి సరిపడే పద్య పాదాలను పాఠంలో వెతికి ఖాళీల స్థలంలో రాయండి.

అ) పేదవాడు యముణ్ణి పిలుస్తున్నాడు.

_______________________________

ఆ) మంచి మార్గాన్ని ఎంచుకొని అనుసరించండి.

_______________________________

ఇ) ఎవరి ఎముకలు భవంతులకు ఇటుకలయాయి?

_______________________________

ఈ) తిండిలేనివాని కడుపులో మంట.

_______________________________

2. కింది చరణాల ఆధారంగా భావంలో ఖాళీలను పూరించండి.

దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
నొనర నిరుపేదకును, వొక్కటే అవియు

కొరలి శిష్టాన్నములు గొనునాకలొకటే
తిరుగు దుష్టాన్నములు తిను నాకలొకటే

భావం:

పగలు, రాత్రులు ________ ఒకటే ________ ఒకటే ________ రకరకాల రుచులతో భోజనం చేసేవాడి ________ దొరికిన వాటితో ________ చేసేవాడి ________ ఒకటే.



3. పద్యభావాలను చదవండి. సరయిన భావంతో ఖాళీలు పూరించండి.

అ) ________________________ విలవిలలాడిపోతున్నాడు పేదవాడు.

ఆ) పేదవాడు రక్తం ధారపోస్తేనే ________________________

ఇ) ఓపికలో వీరికి ________________________ ఎవరూ లేరు.

ఈ) ఇతరుల బాధలను ________________________

ఉ) తన దగ్గర ఒక్కపైసా లేకపోయినా ________________________

4. కింది ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి.

అ) పేదవాడు యముణ్ణి ఎందుకు పిలుస్తున్నాడు?

ఆ) పేదవాని బతుకు ఎలా ఉంది?

ఇ) పేదవారి ఓపిక ఎలాంటిది?

ఈ) ధనవంతులు ఎలా వ్యవహరించాలి?

ఉ) ఆకలిమంట ఎలాంటిది?

### III. స్వీయరచన



1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) 'పేదవాళ్ళు దేవతలతో సమానం' అన్న కవి మాటలగురించి మీ అభిప్రాయం ఏమిటి?

ఆ) నాడు-నేడు పేదవాడు మృత్యువును ఆహ్వానించడానికి కారణాలేవో ఊహించి రాయండి.

ఇ) 'మంచిబాటc గనుడు చనుcడు' అన్న కవి మాటల్ని ఎలా సమర్థిస్తారు?

ఈ) 'ఇబ్బంది పడుతున్న 'పేదవాళ్ళు ఎదురైతే' మీరెలాస్పందిస్తారు?

ఉ) 'అతనికా యిట్టి పరమహేయంపు బ్రదుకు' అని కవి ఎందుకన్నాడో రాయండి.

2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) పేదల జీవితాన్ని గురించి కవి తెలిపిన అంశాలను సొంతమాటల్లో రాయండి.

ఆ) నువ్వే ధనవంతుడవైతే పేదల విషయంలో ఎలా ప్రవర్తించాలనుకుంటున్నావో సొంతమాటల్లో రాయండి.

ఇ) పేదలకు సంబంధించి మీకెదురైన సంఘటనను సొంతమాటల్లో రాయండి.

### IV. పదజాలం



1. కింది వాక్యాలలో గీతగీసిన పదానికున్న సమానార్థాన్ని మరో సందర్భంలో ప్రయోగించండి.

ఉదా:- రహీం రంజాన్ మాసంలో పస్తుండి ప్రార్థనలు చేస్తాడు.
ఆయన ఉపవాసం ఉండి అయినా ఇతరులకు అన్నం పెట్టాలనుకుంటాడు.



అ) ఎల్లారెడ్డి గ్రామంలో ఆర్తులు ఎందరో ఉన్నారు.

ఆ) సంపన్నులకు పేదవారి పట్ల దయను ఉండాలి.

ఇ) ఎందరో అభాగ్యులు పరమ హేయమైన జీవనం గడుపుతున్నారు.

ఈ) ఎల్లప్పుడూ పరహితాన్నే కోరాలి.

2. కింది వాక్యాలలో గీతగీసిన పదానికి అదే అర్థాన్నిచ్చే పదాలున్నాయి. వాటిని గుర్తించి కుండలీకరణంలో (      ) రాయండి.

ఉదా:-అ) సిరి కలవారు సంపత్తి లేనివారిపట్ల ఉదారంగా వ్యవహరించాలి. వారి సంపద దొంగల పాలయినది. (సంపత్తి, సంపద)


ఆ) పసిడి సొమ్ములు ధరించాలని పైడి నగలు చేయించుకుందామనుకున్నారు. కాని బంగారం ధర బాగా పెరిగింది. (          )

ఇ) 'వేల్పు' ను భక్తితో ఆరాధిస్తారు. గుళ్ళో దేవుడికి సేవలు చేస్తారు. మానవులకు సేవచేయటం దైవానికి సేవచేయటం వంటిదే. (          )

ఈ) అతనిది పాషాణ హృదయం. రాయిలా కఠినమైనది కాబట్టి ఎంతకీ కరగదు. శిలాహృదయులు పేదలను చూసి జాలిపడరు.

ఉ) లోకంలో సత్యం పలికేవారున్నారు. ఆ జగంలోనే అసత్యమాడేవాళ్ళూ ఉన్నారు. జగత్తులో అనేక రకాల మనుషులుంటారు. (          )

### V. సృజనాత్మకత



కింది వాటిలో ఒకదాన్ని చేయండి.

అ) నిత్య జీవితంలో పేదల కష్టాలను చూస్తున్నారు కదా? వాళ్ళ వివరాలను తెలుపుతూ 'పేదల గాథలు' అనే శీర్షికతో పత్రికల కోసం 'వార్త' రాయండి.

ఆ) పేదరిక నిర్మూలనను గురించి చిన్న ఉపన్యాసం ఇవ్వండి.

### VI. ప్రశంస



విరాళం సేకరించి అనాథాశ్రమానికి పంపిన విద్యార్థులను ప్రశంసిస్తూ అభినందన సందేశం రాయండి.

### VII. భాషాంశాలు



1. గీతగీసిన పదాలను గమనించండి.

రాము, డేవిడ్, జాన్, కరీం మిత్రులు. వీళ్ళు సెలవులకు హైదరాబాదు వెళ్ళారు.
పైన గీత గీసిన పదాలు పురుషులను గురించి తెలుపుతున్నాయి కదా! ఇలా పురుషులను గురించి తెలిపే పదాలను పుంలింగ పదాలు అంటారు.

♦ ఇప్పుడు మరోరకమైన పదాలు చూడండి.

మంగ, రమ, చాందినీ, సఫియా, షబ్నమ్ జూకు వెళ్ళారు అక్కడ ఎన్నోజంతువులను పక్షులను చూశారు.





గీతగీసిన పదాలు స్త్రీలను గురించి తెలుపుతున్నాయి కదా! ఇలా స్త్రీలను గురించి తెలిపే పదాలను స్త్రీలింగ పదాలు అంటారు.

ఈ కింది గీత గీసిన పదాలు గమనించండి.

లలిత్, ఇమ్రాన్ తోటకు వెళ్ళి, అక్కడ మామిడి చెట్టు చూశారు.
పక్కనే గోడను ఊతంగా తీసుకొని ఆ వృక్షం ఎక్కారు.

గీత గీసిన పదాలను గమనించారు కదా! ఇలాంటి పదాలు ఆయా ప్రదేశాల్లో కదలకుండా స్థిరంగా ఉంటాయి. ఇలా స్థిరంగా ఉండే వాటిని జడాలు అంటారు. వీటినే నపుంసక లింగపదాలు అంటారు.

2. మీ పాఠాల ఆధారంగా పుంలింగ, స్త్రీలింగ, నపుంసక లింగ పదాల జాబితాను తయారుచేయండి.

3. ఈ కింది పేరాను చదవండి. పుంలింగాలను, స్త్రీలింగాలను, నపుంసక లింగాలను గుర్తించండి.

సయ్యద్ దావూద్ మియా శంకర్‌ని కలిశాడు. వీళ్ళిద్దరూ డేవిడ్ ఇంటికి వెళ్ళారు. డేవిడ్ చెట్టుకింద కూర్చున్నాడు. వీళ్ళు వచ్చారని కుర్చీలు తెచ్చాడు. కూర్చోమని చెప్పాడు. కింద కూర్చుంటే హాయిగా ఉంటుంది. చాప తెప్పించండి అన్నారు. రమణి చాప తెచ్చింది. అందరూ కూర్చొని మాట్లాడుకుంటూండగా. షబానా 'టీ' పట్టుకొచ్చింది. 'టీ' తాగుతూ దేశకాల పరిస్థితులను గురించి మాట్లాడుకున్నారు.

## ప్రాజెక్టు పని


**కింది వానిలో ఒకదానిని చేయండి.**

అ) 'మానవ సేవే మాధవసేవ' గా భావించిన మదర్ థెరిసా లాంటి వారి వివరాలను సేకరించండి.

ఆ) పేదల కష్టాలు ఇతివృత్తంగా ఉన్న కథలను పాఠశాల గ్రంథాలయ పుస్తకాలలో చదివి ఇతరులకు చెప్పండి.

## నేనివి చేయగలనా..?





| | | |
|---|---|---|
| 1. | పదాల ఆధారంగా కవి ఇచ్చిన సందేశాన్ని చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పద్యాలను చదివి, భావాలను అర్థం చేసుకోగలను. | ఔను / కాదు |
| 3. | అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | పత్రికలకు వార్తలు రాయగలను. ఉపన్యాసం ఇవ్వగలను. | ఔను / కాదు |

*"సమాజంలో ఇమడలేనివానికి సమాజం సంతోషాన్నివ్వజాలదు."*



©SCERT not to be republished

# అర్థాల పట్టిక

**అ**

అంతిమం = చివర
అదృష్టం = భాగ్యం
అనాథ = ఎవరూలేనివాడు
అనివార్యం = తప్పనిసరి అయినది
అనుమతి = సమ్మతి
అపఖ్యాతి = అపకీర్తి
అభయం = భయంలేనిది, భయంలేకపోవడం
అభిరామ = ప్రియమైన
అమోఘం = గొప్పది; తిరుగులేనిది
అరయు (క్రి.) = తెలుసుకోడం
అల్లకల్లోలం = చెల్లాచెదరు
అసంపూర్ణం = పూర్తిగాలేని

**ఆ**

ఆంతర్యం = అభిప్రాయం
ఆత్మస్థైర్యం = మానసిక దృఢత్వం
ఆయాళ్ళ = ఆరోజు
ఆరంభం = మొదలు
ఆవేదన = బాధ
ఆస్థానం = సభ

**ఇ**

ఇంచుక = కొంచెం
ఇల = భూమి

**ఈ**

ఈర్ష్య = అసూయ

**ఉ**

ఉత్కంఠ = తహతహ
ఉల్లాసపరచడం = సంతోషపరచడం

**ఎ**

ఎరుక = తెలియడం
ఏన్గెదిన్న = ఏనుగుతిన్న

**ఒ**

ఒక్కింత = కొంత, కొద్దిగా
ఒట్టిమాటలు = పనికిరానిమాటలు, ఉత్తిమాటలు
ఓజస్సు = ఉత్సాహం

**క**

కందువ = చిన్న
కడలి = సముద్రం
కడులు = అంచులు
కద్దు = ఉంది
కరతాళధ్వనులు = చప్పట్లు
కపటం = మోసం
కలహం = యుద్ధం, ఘర్షణ
కలత = బాధ
కల్తీ = కలుషిత



కల్ల = అబద్ధం
కళారహితం = కళ (అందం) లేకపోవడం
కాక = వేడి
కానుక = బహుమతి
కాయకష్టం = శారీరక కష్టం
కార్యం = పని
కారాగారం = చెరసాల
కాళం = పాము
కిటుకు = రహస్యం, గుట్టు
కీర్తి = మంచిపేరు, గౌరవం
కుంది = రాతికుదురు
కృతజ్ఞత = చేసినమేలు మరవకపోవడం
కొండ = పర్వతం
కొండెలు = చాడీలు
కోన = అడవి
కోల్పోవు = పోగొట్టుకొను
కోకొల్లలు = అనేకం

**గ**

గగనం = ఆకాశం
గణం = గుంపు
గృహం = ఇల్లు
గాడ్పు = గాలి
గాయాలు = దెబ్బలు
గిట్టని = నచ్చని
గుదిబండ = పశువుల మెడకు కట్టే కఱ్ఱ

**చ**

చాటు (క్రి.) = వెల్లడించడం
చికిత్స = రోగానికి చేసే ప్రతిక్రియ మాన్పడం
చిహ్నం = గుర్తు
చెట్టపట్టాల్ = చేయి చేయి కలుపుకొని
చెన్ను = అందం
చెర = బందీఖానా, జైలు, కారాగారం

**జ**

జాడ = గుర్తు
జాతం = పుట్టుక
జేజేలు = ప్రశంసలు

**త**

తనయుడు = కుమారుడు
తరువు = చెట్టు
తలంపు = ఆలోచన
తారలు = నక్షత్రాలు
తెరపగాలి = చల్లగాలి
త్రోవ = దారి

**ద**

దర్శనం = చూడడం
దళం = సమూహం
దిట్ట = సామర్థ్యం గలవాడు, గట్టివాడు
దివి = ఆకాశం
దివ్వె = దీపం



దూఱడం = నిందించడం
ద్వేషం = పగ
దొడ్డ = గొప్ప
దోషం = తప్పు

**ధ**

ధార్మిక = ధర్మపరమైన, పుణ్యంకలిగించే
ధైర్యం = ధీరత్వం

**న**

నడత = ప్రవర్తన
నవలోకం = కొత్తలోకం
నిక్కము = నిజము

**ప**

పటిమ = గట్టిదనం
పద్మం = కమలం
పరిపాటి = సహజం, ఆనవాయితీ
పానుపు = పరుపు, పడక
పారకు = పారిపోకు
పిన్న = చిన్న
పుష్టి = బలం
పృథ్వి = భూమి
ప్రగతి = అభివృద్ధి
ప్రతిభ = సహజమయిన తెలివి
ప్రథమ = మొదటి
ప్రదర్శన = వివరించి చూపడం

ప్రభువు = రాజు
ఫలం = పండు

**బ**

బండారం = రహస్యం
బహుమతి = కానుక
బట్టీపట్టడం = కంఠస్థంచేయడం
బిగువు = పటుత్వం
బోధపడటం = అర్థమవడం

**భ**

భద్రత = జాగ్రత్త
భేదం = తేడా

**మ**

మకరందం = తేనె
మన్నన = మెప్పు
మర్మం = రహస్యం
మహస్సు = ఉత్సవం
మాధుర్యం = తీయదనం, తీపి
మిథ్య = భ్రమ, లేనిది
మీరకు = అతిక్రమించకు
ముడుచుకొను = చిన్నబోవు
మూలం = మొదలు
మృష = అబద్ధం
మెండు = ఎక్కువ
మేదిని = భూమి



**య**

యథాం = సత్యం

**ర**

రణం = యుద్ధం
రాజదర్బారు = రాచకొలువు
రిపువు = శత్రువు
రుజువు = సాక్ష్యం, నిదర్శనం
రువ్వుచు = వెదజల్లుతూ

**వ**

వంకరటింకర = తిన్నగాలేకపోవడం
వంచకుడు = మోసగాడు
వకీలు = న్యాయవాది
వర్షం = వాన
వ్యర్థం = పనికిరాని
వాఙ్మయం = భాష
వాత్సల్యం = ప్రేమ
వాహ్యాళి = నడక
విధించు (క్రి.) = ఏర్పాటుచేయడం
వివాహం = పెళ్ళి
విశ్వం = ప్రపంచం
విశేషం = అతిశయం
విహరించు (క్రి.) = తిరగడం
వేడుకొను (క్రి.) = ప్రార్థించడం
వేతనం = జీతం
వైభవం = వేడుక, గొప్పతనం, సంపద

**శ**

శరవేగం = బాణందూసుకుపోయేటంతవేగం
శాశ్వతం = నాశనంలేనిది, ఎప్పటికీ ఉండేది
శాస్త్రీయం = శాస్త్రసంబంధమైనది
శ్రీ = సంపద
శుష్కించు (క్రి.) = ఎండిపోవడం

**స**

సంపద = ఐశ్వర్యం
సంపాదించు (క్రి.) = గడించడం
సత్కరించు (క్రి.) = సన్మానించడం, గౌరవించడం
సన్మానం = గౌరవం
సబబు = తగినది, న్యాయం, ఉచితం
సభికులు = సభలో ఎండువాళ్ళు
సమయస్ఫూర్తి = సమయానికి తగినఆలోచన
సరళం = తేలికయినది
స్పర్థ = పోటీ; కలహం
సాధన = అభ్యాసం
స్కాలర్‌షిప్ = ఉపకారవేతనం

**హ**

హతమార్చుట (క్రి.)= చంపడం
హస్తి = ఏనుగు



© SCERT not to be republished